తెలంగాణ,
ఆంధ్రప్రదేశ్
బుధ వారం
04 జనవరి, 2023
సంపుటి - 07,
సంచిక-226
పేజీలు - 4
వెల రూ. 5/-

www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు ❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Vishakapatnam, Vijayawada, Ongole


## సెకండ్ బూస్టర్ డోస్ అసవరం లేదు

కేంద్ర వైద్యారోగ్యశాఖ వర్గాల వెల్లడి



**న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం):** ప్రపంచ వ్యాప్తంగా మరోసారి కరోనా కలవరం మొదలైంది. ముఖ్యంగా చైనాతోపాటు ప్రపంచంలోని పలు దేశాల్లో మహమ్మారి మరోసారి విజృంభిస్తోంది. దీంతో భారత్‌లోనూ కరోనా నాలుగో వేవ్ భయం ప్రజలను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేసులు పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహిస్తూ..

## భారీగా పెరిగిన బంగారం ధరలు

రెండేళ్ల గరిష్టానికి చేరిక



**న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం):** బంగారం ధరలకు రెక్కలు వస్తున్నాయి. ధరలు దూసుకుపోతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పసిడి రేటు రెండేళ్ల గరిష్టానికి చేరింది. గత రెండేళ్లలో ఎప్పుడూ లేనంత ఎక్కువ రేటు పలుకుతోంది. మంగళవారం తులం బంగారం ధర రూ.55,546గా ఉండగా.. కిలో వెండి రేటు 1.4శాతం పెరిగి రూ.70,573గా రికార్డు ఎక్కింది. 2020 ఆగస్టులో బంగారం ధర

## సునీల్ కనుగోలు కేసులో హైకోర్టు కీలక ఉత్తర్వులు

సైబర్ క్రైమ్ పోలీసుల నోటీసులపై స్టేకు నిరాకరణ

8న విచారణకు హాజరు కావాల్సిందేనని వెల్లడి



**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** కాంగ్రెస్ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ సునీల్ కనుగోలుకు హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ వార్ రూం కేసుకు సంబంధించి

## ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో మలుపు

ఎక్సైజ్ శాఖ మాజీ అధికారులకు బెయిల్




**న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కాం రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఈ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ మద్యం కేసులో నిందితులైన ఎక్సైజ్ శాఖ మాజీ అధికారులు కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్ కు మధ్యంతర బెయిల్ మంజూరు

# వాక్ స్వాతంత్ర్యం అందరికీ సమానమే

అందులో ఎలాంటి విక్షకు తావు లేదు

రాజకీయనేతలకు అదనపు ఆంక్షలు కూడా అసాధ్యం

పదవుల్లో ఉన్న వారు స్వీయ నియంత్రణ పాటించాలి

సుప్రీం ధర్మాసనం విస్పష్ట తీర్పు వెల్లడి



**న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం):** వాక్ స్వాతంత్ర్యం హక్కు భారత రాజ్యాంగం ప్రకారం అందరికీ సమాన మేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్లమెంటు సభ్యులు, మంత్రులు, శాసన సభ సభ్యులకు కూడా సామాన్య ప్రజానీకంతో సమానంగా ఈ హక్కు ఉంటుందని తీర్పు చెప్పింది. ప్రజా ప్రతినిధుల వాక్ స్వాతంత్ర్యం హక్కుపై అదనపు ఆంక్షలను విధించడం సాధ్యం కాదని వివరించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల వంటి ప్రజాప్రతినిధుల భావ ప్రకటన స్వేచ్ఛపై పరిమితులు విధించాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) సెక్షన్ లో ఉన్న నిబంధనలు మినహా ప్రజాప్రతినిధుల భావ ప్రకటన స్వేచ్ఛపై అదనపు పరిమితులను విధించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈమేరకు తీర్పు ఇచ్చింది. మంత్రులు చేసే వ్యాఖ్యలను నేరుగా ప్రభుత్వంతో

3వ

# 31నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు


కసరత్తు చేస్తున్న కేంద్రం



**న్యూఢిల్లీ, జనవరి 3 (సమ సమాజం):** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సారి కూడా సమావేశాలు రెండు విడుతల్లో జరుగుతాయని పేర్కొన్నాయి. సమావేశాలు జనవరి 31న ప్రారంభమై, ఏప్రిల్6న ముగియనున్నాయి. దీనిపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. గతంలో మాదిఇగానే ఫిబ్రవరి ఒకటిన కేంద్ర బడ్జెట్ 2023-24ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు సమర్పించనున్నారు. అంతకు ముందు రోజు అంటే జనవరి 31న ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ÷ూష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో తొలిరోజు ఉభయ సభలు ప్రారంభమవుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ద్రౌపది ముర్ముకు రాష్ట్రపతి ఇవి తొలి సమావేశాలు కావడం విశేషం. తొలి విడతలో సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 10 వరకు, రెండో విడతలో మార్చి 6న ప్రారంభమై ఏప్రిల్ 6తో ముగియనున్నట్లు తెలుస్తున్నది.

3వ

# సెల్‌ఫోన్ వాడే పరిస్థితి లేకుండా పోయింది



ఫోన్లు హ్యాక్ అవుతున్నాయన్న ప్రవీణ్ కుమార్

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్

**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** రాష్ట్రంలో ప్రతిపక్ష నేతల సెల్ ఫోన్లను సర్కారు హ్యాక్ చేయిస్తోందంటూ ఇటీవల ఆరోపణలు చేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. తాజాగా దీనికి సంబంధించి మరో ట్వీట్ చేశారు. తెలంగాణకు చెందిన మరో ప్రముఖ పోల్ స్ట్రాటజిస్ట్ వాడే ఆపిల్ ఐఫోన్ ను హ్యాక్ చేస్తామంటూ రెండుసార్లు బెదిరింపు నోటిఫికేషన్ వచ్చాయన్నారు, ఈ విషయాన్ని తనతో అతను పంచుకున్నట్లుగా ప్రవీణ్ కుమార్ ట్వీట్ లో పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించే పౌరుల ఫోన్‌లను హ్యాక్ చేయడం క్షమించరాని

3వ

# బాసర సరస్వతిపై అనుచిత వ్యాఖ్యలు

రెంజర్ల రాజేశ్ వ్యాఖ్యలపై భక్తుల ఆగ్రహం





**నిర్మల్, జనవరి 3 (సమ సమాజం):** బాసర సరస్వతీ దేవిపై రెంజర్ల రాజేష్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో బాసరలో అమ్మవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ క్రమంలోనే ఆలయ అర్చకులతో పాటు పలువురు నిరసనకు దిగారు. బాసరలో బంద్ నిర్వహిస్తున్నారు. రాజేష్‌పై పిడి యాక్ట్ పెట్టాలని రాస్తారోకోకు దిగారు. కలెక్టర్ వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రాజేష్ దిష్టి బొమ్మ

3వ

# ఒక్కో డయాలసిస్ సెంటర్‌పై వందకోట్లు ఖర్చు

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వరంగా డయాలసిస్ సెంటర్లు ◆ చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో ప్రారంభించిన మంత్రులు

**యాదాద్రి, జనవరి 3 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు, వాటి పనితీరు దేశంలో మరెక్కడా లేవని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. డయాలసిస్ సెంటర్లు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు దేవుడు ఇచ్చిన వరం లాంటివని పేర్కొన్నారు. ఒక్కో డయాలసిస్ సెంటర్ నిర్వహణకు వందకోట్ల వరకు ఖర్చు చేస్తున్నామని వివరించారు. పేదలకు వైద్యఖర్చులు లేకుండా ముంగిట్లోకే సేవలు అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని అన్నారు. యాదాద్రి జిల్లా మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న చికిత్స చూసి తమిళనాడులో సీఎం స్టాలిన్ కూడా డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు బస్ పాస్ లు, ఆసరా పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందున్న మూడు డయాలసిస్ కేంద్రాలను 102 కు పెంచామని స్పష్టం చేశారు.చౌటుప్పల్‌లో క్యాన్సర్ పేషంట్ల కోసం పాలియేటివ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.రాబోవు రోజుల్లో మునుగోడు నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించ బోతున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజ్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఒకే సంవత్సరంలో తెలంగాణలో 8 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయగా వచ్చే సంవత్సరం మరో ఎనిమిది కాలేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. నల్గొండ ,సూర్యాపేటలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేసిన చరిత్ర సీఎం కేసీఆర్ దేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బీబీనగర్ లోఎయిమ్స్ ఆస్పత్రి ఇస్తామంటే

3వ





# హైదరాబాద్ మెట్రోకు సమ్మె సెగ

జీతాలు పెంచాలంటూ విధులు బహిష్కరణ ● ధర్నాలు జరుపుతున్న ఏజెన్సీ సంస్థ



**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** హైదరాబాద్ మెట్రోకు కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె సెగ తగిలింది. ఐదేళ్లుగా జీతాలు పెంచడం లేదంటూ మెట్రో రైలు టికెట్ కౌంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మెట్రోస్టేషన్ల వద్ద టికెటింగ్ ఉద్యోగులు ధర్నాలకు దిగి.. తమ నిరసన తెలిపారు. ఇటు అమీర్ పేట లోని మైత్రివనం వద్ద కాంట్రాక్టు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. గత ఐదేళ్లుగా

3వ

## సంపాదకీయం

# మౌళిక అంశాలపై చర్చ చేయాల్సిందే !

దేశంలో లక్ష్యం లేదు..కేవలం ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా పార్టీలు, పాలకులు సాగుతున్నారు. ఇది స్వాతంత్ర్యానంతరం వచ్చిన మార్పులు. సిఎం కెసిఆర్ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా లేవనెత్తిన మౌళిక అంశాల పై ఎప్పటినుంచో చర్చ జరుగుతూనే ఉంది. దేశంలో రాజకీయంగా విప్లవం రావాలని ప్రజలు కోరుకుంటు న్నారు. మేధావుల సైతం గర్జిస్తూనే ఉన్నారు. అనేక అంశాల్లో ప్రజలు లేదా మేధావుల చర్చలకు ప్రాధాన్యం ఇవ్వండ లేదు. ప్రశ్నించే వారిని చట్టం ముందు దోషిగా నిలబెడుతున్నారు. రకరకాల కేసులతో వేధిస్తు న్నారు. అందుకే మూసపద్దతిలో పాలనకు స్వస్తి పలకాలి. ప్రపంచంతో పోటీపడే తత్వం రావాలి. కొత్త ఆవిష్కరణలు రావాలి. యువతకు ఉపాధి, ఉదో÷-యోగాల కల్పనలో అవకాశాలు పెరగాలి. ప్రజల్లో కులమత, వర్గవిభేదాలు సమసిపోవాలి. ఇవన్నీ కూడా ఆచరణ సాధ్యమయ్యేవే. కానీ పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం పెట్టిన పథకాలు తప్ప ప్రజలను ఉద్ధరించేవి కావు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు పథకం మంచిదే అయినా దీని దుబారా గురించి కేసిఆర్ మాట్లా డడం లేదు. పెద్ద రైతులకు,పెత్తందార్లకు కూడా ప్రజలు కట్టిన పన్నుల సొమ్మును అప్పనంగా దానం చేస్తున్నారు. దీనికి కెసిఆర్ సమాధానం ఇవ్వాల్సిందే. అలాగే దళితబంధు ఎంతగా దుర్వినియోగం అవుతున్నదో ప్రారంభంలోనే తేలింది. ఉచితంగా పదిలక్షల పందేరంగా కాకుండా దళితులకు ఉపాధి చూపాలి. వారికి విద్యావైద్యరంగాలను చేరువ చేయాలి. ఈ రెండు పథకాల వెనకా ఓట్ల లక్ష్యం ఉంది. దీన్ని కెసిఆర్ కాదనగలరా చెప్పాలి. ఇక రూపాయికి కిలోబియ్యం ఎంతగా దుర్వినియోగం అవుతున్నదో చెప్పాల్సిన పనిలేదు. దీనిపైనా చర్చించాలి. కిలోరూపాయి బియ్యం పథకం కొందరికి ఆదాయవనరుగా మారింది. ఈ బియ్యాన్ని హోటళ్లకు అమ్ముకుంటున్నారు. రూపాయి బియ్యం దుబారాపై చర్చించడం లేదు. కెసిఆర్ అమలు చేస్తున్న దుబారా, ఓట్ల పథకాలపై ముందు చర్చ సాగాలి. వాటి మంచిచెడులపై ప్రజల్లో చర్చ పెట్టాలి. అప్పుడే కెసిఆర్ చెప్పే ప్రతి అంశానికి విలువ పెరుగుతుంది. పంచాయితీ నిధులు పక్కదారి పట్టించారని ఇటీవల పెద్ద ఎత్తున దుమారం చెలరేగుతోంది. కాంగ్రెస్ ఆందోళనలకు దిగింది. 35 వేల కోట్లు పక్కదారి పట్టించాకరి విమర్శిస్తున్నారు. దీనిపైనా సమాధానం ఇవ్వాలి. లేకపోతే అనుమానాలు ఉండనే ఉన్నాయి. ఇకపోతే ఎన్నికలే లక్ష్యంగా పదవి చేపట్టిన నాటినుంచి జగన్ బటన్ నొక్కుడులో బిజీగా ఉన్నారు. ప్రజలను ఆదుకోవడం వేరు..పంచడం వేరు అన్నది జగన్ గుర్తించడంలేదు. అయితే ఇవన్నీ జగన్‌కు తెలియకుండా చేస్తున్నారని మనం అనుకోవడానికి లేదు. ఆయన లక్ష్యం కూడా ఎన్నికలే కనుక పందేరాలు సాగిస్తున్నారు. ఇప్పుడు ప్రజలు వీటిపై చర్చ చేయాల్సి ఉంది. అలాగే కెసిఆర్ లేవనెత్తిన మౌళిక సమస్యలపైనా చర్చించాలి. దేశంలో ఉన్న వనరులను వినియో గించుకునే క్రమంలో అందుకు అసవరమైనా ప్రణాళికలు సిద్దం చేయాలి. ఉచిత పథకాలను కేసిఆర్ కూడా పక్కన పెట్టి మాట్లాడాలి. ఉచితవిద్యుత్, దళితబంధు కేవలం ఎన్నికల స్టంటం తప్ప మరోటి కాదు. రైతులు, దళితుల సంక్షేమం కోసం పెట్టే నిధులు ప్రజలకు భారంగా మారితే అభివృద్ధి కుంటుపడుతుంది. అలా అన్ని కులాల వారు పోటీపడి తమకూ ఇలాంటి పథకాలు కావాలని అంటారు. అందువల్ల కులాలు, మతాల జోలికి పోకుండా కేవలం వ్యక్తుల ఆర్థికస్థితిగుతులు, సామాజిక స్థితిగతులు ఆధారంగా అందరికీ న్యాయం జరిగేలా పథక రచన సాగాలి. నిజంగానే దేశంలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. సార వంతమైన నేలలు ఉన్నాయి. సిరులు పండించే సత్తా ఉంది. అయినప్పటికీ ప్రజలకు వాటిని అందించ లేని దుస్థితిలో భారత దేశ పాలకులు ఉన్నారు. కావాల్సినంత నీరు, కరెంటు ఉన్నప్పటికీ ఇంకా వాటికి నోచుకోని గ్రామాలు,

పట్టణాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఇంకా ప్రజలు నీరు, కరెంటు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీనిపై ఎవరో ఒకరు నిలదీయాల్సిన అవసరముంది. అది రాజకీయ నాయకుల సమస్యకాదు. ప్రజల సమస్యగానే చూడాలి. ప్రజలు తమ దేశ వనరులను తమకు పంచాలన్న డిమాండ్‌తో ముందుకు సాగాలి. దేశంలో పాలన ను వ్యక్తుల చుట్టూ కాకుండా వ్యవస్థీకృతం కావాలి. చిన్నచిన్న దేశాలు ఎంతో అభివృద్ధి చెందాయి. వాటిని చూసి మనం నేర్చుకోవాలి. జాతి అభివృద్ధి కోసం పోటీపడే పాలనా వ్యవస్థను రూపొందించు కోవాలి. ఎపి, తెలంగాణలనే తీసుకుంటే ముందుగా అమలు చేస్తున్న పలు పథకాలను సమీక్షించాలి. అందుకు ప్రజలు పెద్ద ఎత్తున చర్చ చేయాలి. ఎన్నికల నాటికి ఓ ఎజెండాను ప్రజలే నిర్దేశిం చేలా చేయాలి. ఎపిలో మౌళిక వసతుల కల్పన అన్నది పోయింది. కనీసం రోడ్లను వేయడంలేదు. నీటి ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. అన్నీ బటన్ నొక్కే కార్యక్రమాలు తప్ప మరోటి కానరావడం లేదు. దీనినే అభివృద్ధి అనుకునే పాలకుల వల్ల ఎపి ఎంతగా నష్టపోయిందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ప్రజల్లో వస్తున్న ఆందోళనలు, సమస్యలపై ముందుగా కెసిఆర్, జగగన్‌లు చర్చించాలి. తమ పథకాలు ఎంతమేరకు లబ్ది చేకూరుతు న్నాయో ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. బిఆర్ఎస్‌తో ముందడుగు వేసేముందు కెసిఆర్ విమర్శలనే ఎక్కువగా స్వాగతించాలి. తెలంగాణ క్షేత్రంగా రాజకీయ లక్ష్యాలతో పాటు అభివృద్ధి నమూనాను రూపొందించి అమలు చేయాలి. తాను కోరుకున్న విధానాలు బ్రహ్మాండంగా ఉన్నాయని చెప్పుకోవడం కాదు..వాటిపై చర్చించాలి.మంచీచెడులను ఆహ్వానించాలి. ప్రజల్లో చర్చల ద్వారా వారి ఆలోచనలను స్వీకరించాలి. అప్పుడే సమగ్రమైన సమాచారం రాగలదు. అప్పుడే కెసిఆర్‌కు ఫీడ్ బ్యాక్ రాగలదు. అది ఎంతో విలువైనదిగా గుర్తించాలి. పాలకులు ఈ తరహా ఆలోచనలు చేయాలి. అప్పుడే దేశంలో గుణాత్మక మార్పులకు అవకాశం రాగలదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తాం

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

**మహబూబ్ నగర్, జనవరి 3 (సమ సమాజం):** రానున్న రోజులలో ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ ,క్రీడలు, సాంస్కృతిక ,పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీని వాస్ గౌడ్ అన్నారు .మంగళవారం మహబూబ్ నగర్ బస్సు డిపోకు నూతనంగా కేటాయించిన సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. మహబూబ్ నగర్ నుంచి హైదరాబాద్ మధ్య పటిష్టమైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులను కూడా ఇతర ఉద్యోగుల మాదిరిగా భరోసా కల్పించే విషయం ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని వెల్లడించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆర్టీసీలో అధునాతన సౌకర్యాలతో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. మహబూబ్ నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైనందున జిల్లాలో ఆర్టీసీని కూడా పటిష్ట పరిచనున్నట్లు వెల్లడించారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ నిదర్శనమని, ప్రైవేటు వాహనాలలో ప్రయాణించడం సురక్షితం కాదని పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలో సిటీ బస్సులతో పాటు ,ఎలక్ట్రిక్ బస్సులను కూడా నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కే.సీ నర్సింహులు, జిల్లా రైతుబంధు



అధ్యక్షులు గోపాల్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణెళిశ్, రీజినల్ మేనేజర్ శ్రీదేవి, ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత,ఇతర అధికారులు, ఆర్టీవో నరేశ్ కుమార్, డీఎస్పీ మహేశ్, ఆర్టీసీ నాయకులు జి ఎల్ గౌడ్ , జీఎస్ చారి తదితరులు పాల్గొన్నారు

# గ్రామ సర్పంచుల నిధులు మాయం చేసిన దొంగలు ఎవరు ?

### ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ కోర్‌కమిటీ సభ్యురాలు ఇందిరా శోభన్

**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామపంచాయతీలకు 10 లక్షల పారిషితోకము ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది అందుకోసమని రాష్ట్రంలో ఎన్నో గ్రామ పంచాయితీలు ఎన్నికలకు పోకుండా ఎన్నికల ఖర్చు వృధా చేయకుండా ప్రభుత్వం ఇస్తున్న పది లక్షల పారిషితోకంతో గ్రామఅభివృద్ధికి ఉపయోగించుకోవడానికి గ్రామస్తులందరూ ఏకగ్రీవముగ సర్పంచ్ ఎన్నుకున్నారు అని మీడియా సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యురాలు ఇందిరా శోభన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఇందిరా శోభన్ మాట్లాడుతూ... ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామపంచాయతీ సర్పంచులది ఒక్కొక్కరరు ఒక్కో రకమైన వ్యధలు అనుభవించారు వారు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ దంతాలపల్లి మండల కేంద్ర సర్పంచ్ సుస్మిత ఇండిపెండెంట్గా గెలిచి టిఆర్ఎస్ పార్టీలో చేరి గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం 20 లక్షలు అప్పు చేసి బిల్లులు రాక కూలి పనికి పోతుంది, ఊరి కోసం అప్పు చేసి కూలిగా మారిన సర్పంచ్, అశ్వరావుపేట వేదాంతపురం ఎంఏ చేసిన విద్యావంతుడని ప్రసాద్ ని ఏకగ్రీవంగా సర్పంచిగా ఎన్నుకున్నారు, గ్రామపంచాయతీ అభివృద్ధి చేయలేక ఏమైనా పని ఉంటే కల్పించండి అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టుకున్నాడు, మునుగోడు మిరియాల సర్పంచ్ వెంకన్న చేసిన పనులకు బిల్లులు లేవని చేయటానికి నిధులు లేవని ఊర్లో భిక్షాటన చేసినారు. రోడ్లకు పైసలు లేవని గుమస్తాలకు పైసలు లేవని లైట్లకు పైసలు లేవని వారికి జీతాలు లేవని మెదక్ జిల్లా వెలమకన్న గ్రామ సర్పంచ్ 30 లక్షల అప్పు చేసి పనులు చేస్తే బిల్లులు రాకపోవడంతో భిక్షాటన చేశాడు. నల్గొండ చీకటి గూడెం సర్పంచ్ వర్కర్లకి జీతాలు ఇవ్వలేక డ్రైవర్ను పెట్టుకోలేక తనే ట్రాక్టర్లు తోలుతూ గ్రామపంచాయతీ పనులు తానే చేసుకుంటున్నాడు మల్టీ పర్పస్ వర్కర్ కావాలని డిపిఓ కి కలెక్టర్ కి విజ్ఞప్తి చేసుకున్నాడు. ముంబైలో కూలి పని చేసుకునే బతికే నీలాబాయిని ఏకగ్రీవ సర్పంచి చేసింద్రు నారాయణపేట జిల్లా కుమ్మరి కుంట గ్రామస్తులు. ఏకగ్రీవ సర్పంచి చేస్తే ఇస్తానన్న నజరానా 10 లక్షలు ఇవ్వలేదు స్మశాన వాటిక కోసం ఆరు లక్షల అప్పు తెచ్చి పని చేస్తే బిల్లు రాలేదు. మళ్ళీ కూలి పనికి పోవాలేమో తప్ప వేరే మార్గం కనబడుటలేదని వాపోయారు. మెదక్ జిల్లా భీమ్లా తండా చిన్న నాయక్ సర్పంచ్ ఆఫీసర్ల ఒత్తిడితో ఊర్లో డంప్ యార్డ్ స్మశాన వాటిక విలేజ్ పార్క్ కోసం 10 లక్షలు అప్పు చేసి పని పూర్తిచేశారు,చేసిన పనికి బిల్లు వస్తలేదని జీవితంలో ఇంకెప్పుడు సర్పంచ్ కావద్దు అని



వాపోయారు. నిర్మల్ జిల్లా గొల్లమడ సర్పంచ్ మహేష్ 20 లక్షల మిత్తికి తెచ్చి పనిచేసిన ప్రతి నెల మిత్తి కడుతున్నరు. ఇబ్రహీంపట్నం మూలరాంపురం సర్పంచ్ సంతోష్ అప్పుచేసి పనులు చేసిండు ఇప్పటికే మూడు ఎకరాలు భూమి అమ్మిండు బిల్లు రాకపోవడంతో రెండు నెలల క్రింద మామిడి తోటలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుండు. వరంగల్ జిల్లా అమృత తండా సర్పంచ్ వెంకన్న కొడుకు అప్పు తెచ్చి పనులు చేసిండు బిల్లులు రాకపోవడంతో రోడ్డున పడ్డారు. తలకొండపల్లి మండలం సర్పంచులు అందరూ మూకుమ్మడిగా కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడించింది. కొమురం భీం జిల్లాలో వాంకిడు మండలం 18 మంది ఆదివాసి సర్పంచులు రాజీనామా చేసింద్రు. గ్రామం అనేది ఇండిపెండెంట్ యూనిట్ తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రగతి గ్రామ జ్యోతి అనే పేరుతో ఆర్భాటంతో ప్రచారాలకే పరిమితమైంది తప్ప గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు ఎక్కడా కూడా నిధులు ఇవ్వలేదు. 15 ఫైనాన్స్ కమిషన్ పైసలు నేరుగా గ్రామపంచాయతీల అకౌంట్లో కేంద్ర ప్రభుత్వం నుంచి పడితే సర్పంచుల యొక్క డిజిటల్‌కి ని తీసుకొని ప్రభుత్వం అక్రమంగా డ్రా చేసుకుంది,పోయిన మార్చి నుండి ఇప్పటివరకు గ్రామ పంచాయితీ బిల్లులు లేవు. గ్రామపంచాయతీలో దొంగలు పడ్డారు ఉపాధి హామీ నిధులను రైతు వేదికలకు రైతు కల్లాలకు గ్రేవియార్డ్లకు వైకుంఠధామాలకు మళ్లించినట్లు గ్రామ సర్పంచులు చెబుతున్నారు. కొన్నిసార్లు ప్రభుత్వం సర్పంచులకు ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అవడం శోచనీయం శాసనసభ్యుల యొక్క జీతాలు కట్ చేసి అయినా గ్రామపంచాయతీ నిధులు ఇస్తాం ఎట్టి పరిస్థితుల్లో నిధులు ఆపమని అన్నారు కానీ ఆచరణలో ఏమీ జరుగుటలేదు,ల. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచుల పట్ల ప్రభుత్వం ఎంతో అమానవీయంగా వ్యవహరిస్తున్నదని సర్పంచ్ల వేదనలు ఆత్మహత్యలు, కుటుంబాల విచ్చిన్నము చూసిన తర్వాత స్పష్టంగా తెలుస్తుంది అనే శ్రీమతి ఇందిరా శోభన్ గారు అన్నారు. గ్రామపంచాయతీ నిధులను వెంటనే విడుదల చేసి గ్రామాల ఆర్థిక పరిపుష్టిని కాపాడాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ డిమాండ్ చేస్తుంది.

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అన్నారు గాంధీ గారు... అందుకే గుజరాత్ రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి గ్రామానికి 10 లక్షల రూపాయల నిధులు ,సర్పంచ్ కి పదివేల రూపాయల జీతం ఇస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్కేజీవాల్ ప్రకటించారు. గ్రామాలు అభివృద్ధి లేకపోతే రాష్ట్రము ఏ విధంగా బంగారు తెలంగాణ అవుతదో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పాలని ఇందిరా శోభన్ డిమాండ్ చేశారు. పూర్తిగా గ్రామ వ్యవస్థను నిర్వీర్యం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు, ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ గ్రామ అభివృద్ధి పట్ల లేకపోవడం దురదృష్టకరమని ఇందిరా శోభన్ అన్నారు, కమిషన్ నిధులు మండలాలకు 10 శాతం జిల్లాలకు ఐదు శాతం గ్రామ పంచాయతీలకు 85% షేర్ అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో సర్పంచ్ల తోటి కొత్త అకౌంట్లు తెరిపించి నేరుగా నిధులను గ్రామ పంచాయతీ అకౌంట్లులకు జమ చేస్తుంది అయితే గత ఐదు నెలల నుండి కేంద్రం నుంచి నిధులు లేవు. ఈ మధ్యనే ఒక నెల నిధులు జమయ్యాయి ఈ నిధులను కరెంటు బిల్లుల కోసం ప్రభుత్వం సర్పంచ్లకి చెప్పకుండానే డిజిటల్ కి ద్వారా డ్రా చేసుకొని సర్పంచ్లకు మొండి చెయ్యి చూపిందాని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. మూడంచెల అధికార వ్యవస్థలో (కేంద్రం, రాష్ట్రం, పంచాయతీ/నగరపాలిక) లెక్క ప్రకారం అయితే ఆదాయాన్ని ముగ్గురు సమభాగాల్లో 33 శాతం మూడు చొప్పున నిధులు పంచుకోవాలని అలాంటిది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరి 50% పంచుకొని గ్రామపంచాయతీ నగరపాలిక లకు బిచ్చం ఇచ్చినట్టు ప్రభుత్వాలు నిధులు విధులు ఉన్నాయని సుమతి ఇందిరా శోభన్ గారు తీవ్రంగా విమర్శించారు,పన్నులు కట్టేది ప్రజలేనని ప్రజలంతా ఉండేది గ్రామాల్లో పట్టణాల్లో నని వారి అవసరాలు వాలి అభివృద్ధి పనులు చేసుకోలేని దుస్థితిలో ఉన్నారని పాఠశాలలో బెంచి విరిగిపోయిన, రోడ్డు రిపైర్ చేసుకోవాలన్న, ఊళ్లో ఒక టీచర్ని నియమించుకోవాలన్నా, ఒక కరెంటు స్తంభం వేసుకోవాలన్న, ఒక చిన్న నాలా కట్టుకోవాలి అన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడి ఉన్నదని ఈ సందర్భంగా ఇందిరా శోభన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం యొక్క హక్కులను కాలరాస్తుందని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల హక్కులను కాల రాస్తామనే విధంగా వ్యవహరించడం చాలా దుర్మార్గమని వ్యవస్థలో బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వాళ్లే బాధ్యతను మరిచి వారి హక్కులకు భంగం కలిగించినప్పుడు ప్రజా వ్యతిరేకత తప్పదని ఇందిరా శోభన్ ప్రభుత్వాలను హెచ్చరించారు.

# కేసీఆర్‌కు మాత్రమే దేశ సారధ్యం సాధ్యం

ప్రత్యామ్నాయ కూటమి కోసం ప్రజల ఎదురుచూపు

కాంగ్రెస్, బిజెపీలపై ప్రజలు విసిగి పోయారు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అభిప్రాయం



**వరంగల్, జనవరి 3 (సమ సమాజం):** దేశ రాజకీయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిశితంగా పరిశీలిస్తున్నారని, జాతీయ రాజకీయాల్లో తనవంతు కీలక భూమిక పోషిస్తారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతున్న బిజెపిని గద్దె దింపాల్సిన అసవరం ఉందన్నారు. తెలంగాణ బిజెపి నేతలు యాగీ చేయడం తప్ప రాష్ట్రానికి ఉపయోగపడే పనులు చేయడం లేదన్నారు. దేశానికి నాయకత్వం వహించే లక్షణాలు సీఎం కేసీఆర్‌కు ఉన్నాయని... సీఎం నేతృత్వంలో ప్రత్యామ్నాయ కూటమి ఏర్పడాలని ఆకాంక్షించారు. దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం రావాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఆయనతోనే దేశ రాజకీయాల్లో మార్పు సాధ్యమని అన్నారు. దేశంలో ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని, అందుకు బిఆర్ఎస్ సమాధానమని తెలిపారు. బిజెపి పాలనతో విసిగి పోయారని అన్నారు. జిఎస్టీ వసూళ్లు, నోట్ల రద్దు, నిరుద్యోగం, పెట్రో ధరల పెంపుతో బిజెపి రంగు బయటపడిందన్నారు. దేశానికి నాయకత్వం వహించే శక్తి కేసీఆర్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. మోదీ నాయకత్వంలో బ్యాంకులు లూటీ అవుతున్నాయని, బ్యాంకుల స్కామ్ వెనుక మోదీ ప్రభుత్వం ఉన్నట్లుందని ఆరోపించారు. దేశ వనరులను కాంగ్రెస్, బీజేపీ ఉపయోగించుకోలేక పోయిందని వ్యాఖ్యానించారు. వామపక్షాలు కూడా కెసిఆర్ నాయకత్వాన్ని సమర్థిస్తున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్‌కు తెలుగు ప్రజలు అందరూ మద్దతు తెలపాలన్నారు. బిఆర్ఎస్ ఎపిలోనూ ప్రభంజనం సృష్టిస్తుందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలు విసిగి వేసారి పోయారన్న మంత్రి అక్రమాలకు బిజెపి కేరాఫ్ అడ్రస్ అయిందన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో సంస్కరణలు ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్న మాజీమంత్రి.. వనరులను సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచన కాంగ్రెస్, బీజేపీకి లేదన్నారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నప్పుడు దేశంలో రైతులకు ఉచిత కరెంట్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపిల కు అసలు అంశం లేకుండా పోయిందన్న భావన వస్తోంది. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్రపై సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. కేసీఆర్ ప్రకటన తర్వాత ఇప్పుడు రాజకీయ చర్చలన్నీ ఆయన చుట్టూనే చర్చ కేంద్రీకృతమయ్యాయి. దేశవ్యాప్తం గా రాజకీయ వర్గాలతో పాటు రాష్ట్రంలోని సాధారణ ప్రజానీకం కూడా కేసీఆర్ జాతీయ రాజకీయరంగ ప్రవేశం, అందుకు దారితీసిన పరిస్థితులు, పర్యవసానాలు, భవిష్యత్తులో చోటు చేసుకోనున్న పరిణామాలు, టీఆర్ఎస్ పార్టీలో అంతర్గత మార్పులపై ఊహాగానాలు, అంచనాలు సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలం నుంచి ఎత్తుగడలను వేయడంలో కెసిఆర్ సిద్ధహస్తుడు. జాతీయ రాజకీయాల్లో పెను మార్పులకు కెసిఆర్ కేంద్ర బిందువు కాగలరని ఎర్రబెల్లి విశ్లేషించారు. మొత్తంగా కెసిఆర్ జాతీయ రాజకీయాలకు చేరువ అవుతున్నారని, బిజెపి తీరును విమర్శిస్తూ కెసిఆర్ తగిన సమయంలో తగు నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

# మోటర్లకు మీటర్లు పెట్టనందుకు నిధులు నిలిపివేత

## కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి హరీష్ రావు



**నల్లగొండ, జనవరి 3 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం బోరుబావుల కాడ కరెంటు మీటర్లు పెట్టలేదనే అక్కసుతోనే కేంద్ర ప్రభుత్వం వేలకోట్ల నిధులను ఆపేసిందని మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఏడాదికి రూ.6వేల కోట్లు చొప్పున గత రెండేళ్లలో రూ.12వేల కోట్లు ఆపారని పేర్కొన్నారు. ఈ కారణం వల్లే రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కొరత ఎదురైందని, అయినా సంక్షేమ పథకాల అమలును ఆపలేదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి గత ఐదేళ్లకు సంబంధించిన రూ.30వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని చెప్పారు. వ్యవసాయానికి మీటర్లు పెట్టేది లేదని సిఎం కెసిఆర్ తెగేసి చెప్పారని అన్నారు. రైతుకు ఉరితాళ్లు బిగించేది లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం అమ్ముతుంటే.. తాము కాపాడు తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీని కూడా చేపడుతున్నామని గుర్తు చేశారు. నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా మర్రిగూడలో నిర్మించిన 30 పడకల సీహెచ్సీ హాస్పిటల్ ను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. మునుగోడు బై పోల్ టైంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆస్పత్రిని నిర్మించి మర్రిగూడ ప్రజలకు అందిస్తున్నామని వెల్లడించారు. 42 మంది వైద్య సిబ్బంది మర్రిగూడకు వచ్చారంటే అది సీఎం కేసీఆర్ దార్శనిక పాలన వల్లే సాధ్యమైందన్నారు. అంబులెన్సు, డిజిటల్ ఎక్స్ రే మిషన్ ను కూడా మర్రిగూడ ఆస్పత్రికి ఇచ్చామని తెలిపారు. మర్రిగూడ హాస్పిటల్ కు జనరేటర్, అల్ట్రా సౌండ్ మెషిన్ ను కూడా మంజూరు చేస్తాం. గైనిక్ డాక్టర్ ను ఇక్కడి ఆస్పత్రికి కేటాయిస్తం. క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఇక్కడనే చేయించుకునేటట్టు ఏర్పాట్లు చేస్తం. మునుపెన్నడూ లేని విధంగా నల్లగొండ జిల్లాకు సీఎం కేసీఆర్ 2 మెడికల్ కాలేజీలు మంజూరు చేశారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు సావిత్రిబాయి పూలే విశేష కృషి

### ఆమె అడుగుజాడల్లోనే తెలంగాణ సంక్షేమకార్యక్రమాలు

### నివాళి అర్పించిన మంత్రులు గంగుల,ఎర్రబెల్లి

**హైదరాబాద్, జనవరి 3 (సమ సమాజం):** సమాజంలో అణగారిన వర్గాలు, మహిళా సాధికారతకు సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బహుజన సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని అన్నారు. హాత్మా పూలే పేరున 310 గురుకులాలతో పాటు విదేశీ స్కాలర్‌షిప్‌లను సైతం అందిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున వేల కోట్ల విలువ చేసే స్థలాల్లో 41 కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుకబడిన వర్గాల సంక్షేమానికి వేల కోట్లను ఖర్చు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం పూలే స్ఫూర్తిని ఇక ముందూ కొనసాగిస్తామని అన్నారు. ఇకపోతే సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం అనేక మహిళా కార్యక్రమాలను చేపడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.





సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పించారు. విద్య ద్వారానే మహిళల వికాసం జరుగుతుందని నమ్మి, తొలి ఉపాధ్యాయురాలుగా విద్యను బోధించారని గుర్తు చేశారు. మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి, దళిత, బహుజన స్త్రీ జనోద్ధరణ కోసం తన జీవితాంతం కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి అని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల వికాసం, సాధికారత కోసం బాలికల విద్య, సంక్షేమం, భద్రత, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం కేజీబీవీలను పక్కన పెట్టగా కేసీఆర్ ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ కేజీబీవీలను గతంలో కంటే గొప్పగా కొనసాగిస్తోందన్నారని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు తొలిసారిగా డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలు పెట్టిన ఘనత కూడా తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇంటర్ తర్వాత మహిళలు విద్య మానేయకుండా కొనసాగించేందుకు 53 డిగ్రీ కాలేజీలు ప్రారంభించిందని వెల్లడించారు. మహిళల పేరుపై ఇండ్ల మంజూరు, పట్టాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, న్యూట్రిషన్ కిట్స్, కేసీఆర్ కిట్స్ అందజేస్తుందని వివరించారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆచరణలో అమలు చేస్తూ ఆమెకు నిజమైన నివాళులు తెలంగాణ ప్రభుత్వం అర్పిస్తుందని అన్నారు.

## ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో మలుపు



(మొదటి పేజీ తరువాయి)చేసింది సీబీఐ స్పెషల్ కోర్టు. ఇందులో ముత్తా గౌతమ్, అరుణ్ పిళ్ళై, సమీర్‌లకు రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేయగా.. ఇందులో మొత్తం ఏడుగురి నిందితులపై సీబీఐ ఛార్జ్ షీట్ ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సీబీఐ ఛార్జ్ షీట్ పై విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు బెయిల్ జారీ చేసింది. కేసులో అభిషేక్ బోయిన్ పల్లి, విజయ్ నాయర్ ను అరెస్ట్ చేయగా మిగతా వారిని మాత్రం అరెస్ట్ చేయలేదు. ఈ క్రమంలో ఇవాళ ఉదయం కోర్టు కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్ కు మధ్యంతర బెయిల్ ఇవ్వగా.. ముత్తా గౌతమ్, అరుణ్ పిళ్ళై, సమీర్ లకు రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా రెగ్యులర్ బెయిల్ కోసం మాత్రం ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తుంది.

## సునీల్ కనుగోలు కేసులో హైకోర్టు కీలక ఉత్తర్వులు



(మొదటి పేజీ తరువాయి) సైబర్ క్రైం పోలీసులు ఇచ్చిన నోటీసులపై స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ నెల 8న సునీల్ కనుగోలు సైబర్ క్రైం విచారణకు హాజరు కావాల్సిందే నని ఆదేశించింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ వార్ రూం కేసులో సైబర్ క్రైం పోలీసులు సీఆర్పీసీ 41ఏ నోటీసులు ఇవ్వడంపై సునీల్ కనుగోలు హైకోర్టును ఆశ్రయించారు. నోటీసులపై స్టే ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వంతో పాటు నాయకులపై అసత్య ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలపై వార్ రూంలో సోదాలు నిర్వహించిన పోలీసులు దొరికిన ఆధారాల మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఆ పోస్టులతో తనకు సంబంధం లేదని సునీల్ కనుగోలు కోర్టుకు విన్నవించారు. ఎఫ్ఐఆర్?లో సునీల్ కనుగోలు పేరు తొలగించాలని ఆయన తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అయితే ఎఫ్ఐఆర్ లో ఏ1 నిందితుడిగా ఉన్న సునీల్ ను ప్రశ్నించేందుకు అనుమతించేలా ఆదేశించాలని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు.

## భారీగా పెరిగిన బంగారం ధరలు




(మొదటి పేజీ తరువాయి) అత్యధికంగా రూ. 56,500 గా పలికింది. అంతర్జాతీయంగా ఔన్స్ గోల్డ్ రేటు 0.8శాతం పెరిగి 1,838.69 డాలర్లకు చేరింది. 2022 చివరి త్రైమాసికంలో బంగారం ధరలు 10శాతం పెరిగింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో తులం రేటు రూ.50 వేల నుంచి రూ.55 వేల వరకు పలికింది. రేటు పెరిగేందుకు డాలర్ విలువ పడిపోవడం కారణమేనని రిసెర్చ్ అనలిస్టులు అంటున్నారు. ఈ లెక్కన చూస్తే 2023లో బులియన్ మార్కెట్ ఆశాజనకంగా మారతుందని చెబుతున్నారు.

## సెకండ్ బూస్టర్ డోస్ అసవరం లేదు




(మొదటి పేజీ తరువాయి) దేశంలో కొవిడ్ వ్యాప్తిని పరిశీలిస్తోంది. కొవిడ్ టెస్టులు, క్వారంటైన్ సదుపాయాలు, వ్యాక్సిన్ మొదలుకొని ఆసుపత్రుల్లో చేయాల్సిన ఏర్పాట్లపై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేస్తోంది. ఇదే సందర్భంలో దేశంలో రెండో బూస్టర్ డోస్‌పై చర్చ నడుస్తోంది. దీనిపై తాజాగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. కరోనా ముప్పు ఉన్నప్పటికీ ప్రస్తుతానికి రెండో బూస్టర్ డోస్ అవసరం లేదని అభిప్రాయపడ్డాయి. కరోనా నిరోధానికి బూస్టర్ డ్రైవ్‌ను పూర్తి చేయడం ప్రభుత్వ మొదటి లక్ష్యం అని పేర్కొన్నాయి. 'ప్రస్తుతం దేశంలో రెండో బూస్టర్ డోస్ అవసరం లేదు. ముందుగా బూస్టర్ డ్రైవ్‌ను పూర్తి చేయాలి' అని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఇప్పటి వరకు మన దేశంలో 220.11(2,20,11,23,642) కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇప్పటికే వెల్లడించారు.

## బాసర సరస్వతిపై అనుచిత వ్యాఖ్యలు



(మొదటి పేజీ తరువాయి) దగ్ధం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. బాసర అమ్మవారి ఆలయ అర్చకులు రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల అయ్యప్పస్వామిపై బైరి నరేష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సమయంలో ఆయన పక్కనే రెంజర్ల రాజేష్ కూడా ఉన్నారు. వివాదం ముదిరిన సందర్భంలో బైరి నరేష్‌కు సోషల్ మీడియా లో మద్దతు తెలిపి వివాదానికి మరింత ఆజ్యం పోశారు. ఈ క్రమంలోనే రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని అయ్యప్ప స్వాములు ఆయన ఇంటి ముందు ఆందోళన చేశారు.

## 31నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు



(మొదటి పేజీ తరువాయి) బడ్జెట్ సమావేశాల తొలి విడతలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ చేసే తీర్మానంపై చర్చించనున్నారు. ఆ తర్వాత కేంద్రబడ్జెట్‌పై జరిగే చర్చలకు ఆర్థిక మంత్రి సమాధానం సమాధానం ఇవ్వనున్నారు. రెండో విడుత సమావేశాల్లో వివిధ మంత్రిత్వ శాఖలకు నిధుల కేటాయింపులపై చర్చించడం, బడ్జెట్‌కు ఆమోదం తదితర అంశాలపై చర్చించనున్నారు. ఇకపోతే ఇప్పటికే వివిధ శాకలు బడ్జెట్ కసరత్తును మొదలు పెట్టాయి. చేనేతను ఆదుకోవాలని, బడ్జెట్ కేటాయింపులు చేయాలని మంత్రికెటిఆర్ ఇప్పటికే కేంద్రాన్ని కోరారు. చేనేతపై జిఎస్టీ ఎత్తేయాలన్నారు.

## ప్రజాసంక్షేమంతో ఆకర్శితులవుతున్నారు

### పార్టీలో చేరిన వారికి కండువా కప్పిన చిరుమర్తి




**నల్లగొండ, జనవరి 3 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ నియోజకవర్గం కేతపల్లి మండలం బండపాలెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఎనిమిదేండ్లుగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చురుకుగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వెల్లడించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మారం మీనా రెడ్డి, దుదిపాల సాగర్ రెడ్డి, వంగూరి యేసు, అరుణ్ కుమార్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ పట్టణానికి చెందిన లబ్ధిదారులకు నూతన పెన్షన్ కార్డులను పంపిణీ చేశారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రభుత్వం పెన్షన్ అందజేస్తుందన్నారు. నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రాజకీయాల కతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

## మెస్ తెరవాలంటూ ఓయూ విద్యార్థుల ఆందోళన



**హైదరాబాద్,జనవరి3(సమ సమాజం):** ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళకు దిగారు. తమకు వెంటనే మెస్ సౌకర్యం కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేశారు. విద్యార్థుల ఆందోళనతో రోడ్డు పై కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. గత రెండు నెలలుగా తమకు మెస్ వసతి కల్పించటం లేదని ఇ-2 హాస్టల్ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

## సెల్‌ఫోన్ వాడే పరిస్థితి లేకుండా పోయింది



(మొదటి పేజీ తరువాయి) నేరమన్నారు. స్టేట్ హ్యాకర్లను శిక్షించండి అనే హ్యాష్ ట్యాగ్ తో ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నేతల సెల్ ఫోన్లను సర్కారు హ్యాక్ చేస్తుందని ఇటీవల ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కామెంట్స్ చేశారు. రాష్ట్రంలో సామాన్యుల నుంచి లీడర్ల దాకా ఎవరి ఫోన్లకూ సేఫ్టీ లేదన్నారు. ముఖ్యంగా అపోజిషన్ లీడర్లు ధైర్యంగా సెల్‌ఫోన్ ÷-వాడే పరిస్థితి లేదన్నారు. తన ఫోన్ కూడా హ్యాక్ అయిందని, స్వయంగా ఆపిల్ నుంచి మెయిల్ వచ్చిందని, దీనిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఇది పిరికిపంద చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్ మెట్రోకు సమ్మె సెగ



(మొదటి పేజీ తరువాయి) ప్రతి నెల 11 వేల రూపాయల జీతం మాత్రమే ఇస్తున్నారని.. వేతనాలు పెంచమంటే పట్టించుకోవడం లేదని సమ్మె చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా ప్రభావంతో ఐదేళ్లలో అన్ని ధరలు పెరిగినా తమకు జీతాలు మాత్రం పెరగకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కనీస వేతనం రూ.15 వేల నుండి రూ.18 వేల వరకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఐదేళ్లుగా కాంట్రాక్ట్ ఏజెన్సీ సంస్థ కియోలిస్ హైదరాబాద్ మెట్రో రైలు సర్వీసులు, స్టేషన్స్ బాధ్యతలు చూస్తోంది. ఈ బాధ్యతలను ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ.. సబ్ కాంట్రాక్టు ద్వారా కియోలిస్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థే ఉద్యోగ నియమాకాలు చేపట్టింది. అయితే.. జీతాల విషయంలో మాత్రం కియోలిస్ సంస్థ నిరక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఇటు అమీర్ పేట్ మెట్రోస్టేషన్ లో కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన చేపట్టారు. హైద్రాబాద్ మెట్రో ప్రాజెక్ట్ లో పని చేస్తున్న 300 మంది కాంట్రాక్టు ఉద్యోగులు తమకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. మెట్రోస్టేషన్స్ లో టికెటింగ్, మెయింటెనెన్స్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు 5 ఏళ్లుగా జీతాలు పెంచడం లేదంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని జీతాలతో బతుకు కష్టంగా మారిందని అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల విషయంలోనూ తమకు చాలా సమస్యలు ఉన్నాయని ఆరోపించారు. ఒకరు ఉద్యోగం చేస్తుంటే మరో రిలీవర్ సరైన సమయానికి రాకపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం భోజనం చేయడానికి కూడా సమయం ఇవ్వడం లేదంటున్నారు. మరోవైపు అమీర్ పేట, మియాపూర్ మెట్రోస్టేషన్లలో ప్రయాణికులు టికెట్ల కోసం పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మరోవైపు మెట్రో కాంట్రాక్టు సిబ్బంది ఆందోళనలపై కాంట్రాక్ట్ ఏజెన్సీ సంస్థ కియోలిస్ స్పందించింది. కొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు బహిష్కరించి..హైదరాబాద్ మెట్రో ట్రైన్ కార్యకలాపాలకు అవాంతరాలు కలిగించారని హెచ్ఎంఆర్ మేనేజ్‌మెంట్ ఆరోపించింది. మెట్రోట్రైన్ ప్రయాణికులకు అసౌకర్యం కలిగించారని పేర్కొంది. సిబ్బందికి తగిన వసతులు, ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపింది. ధర్నా చేస్తున్న ఉద్యోగులతో కాంట్రాక్టు సంస్థ చర్చలు జరపనుంది. మెట్రో ట్రైన్ కార్యకలాపాలు నిర్ధేశిత సమయానికే నడుస్తున్నాయని తెలిపింది. మెట్రో టికెటింగ్ సిబ్బందితో కియోలిస్ ఏజెన్సీ ప్రతినిధుల చర్చలు జరుపుతున్నారు. మరోవైపు మెట్రోస్టేషన్ కింద కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన కొనసాగుతోంది. ప్రస్తుతం అక్కడ పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

## ఒక్కో డయాలసిస్ సెంటర్‌పై వందకోట్లు ఖర్చు



(మొదటి పేజీ తరువాయి) ఐదు కోట్ల విలువైన భూమి ఇచ్చామని, అక్కడ ఎంబీబీఎస్ చదువుకున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, ఆసుపత్రుల మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ రాజు, కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు

## యాదాద్రీశుడికి రికార్డుస్థాయి ఆదాయం

### 20 రోజుల్లో రూ. 2 కోట్ల పైగా రాబడి



**యాదాద్రి భువనగిరి, జనవరి 3 (సమ సమాజం):** యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం సమకూరింది. గత 20 రోజుల్లో రూ. 2 కోట్ల 12 లక్షల 16 వేల 700లు హుండీ ఆదాయం వచ్చింది. బంగారం 167 గ్రాములు రాగా, వెండి 2 కిలోల 600 గ్రాములు వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. క అమెరికా డాలర్లు 1194, యూఏఈ దిర్హామ్స్ 140, ఆస్ట్రేలియా డాలర్స్ 150, ఇంగ్లండ్ పౌండ్స్ 30, కెనడా డాలర్స్ 45, ఒమాన్ బైసా 10,500, న్యూజిలాండ్ డాలర్స్ 45, సింగపూర్ 74 డాలర్స్, మలేషియా రింగ్గిట్స్ 69, సౌదీ రియల్స్ 27 వచ్చాయి.

## వాక్ స్వాతంత్ర్యం అందరికీ సమానమే

(మొదటి పేజీ తరువాయి) ముడిపెట్టి చూడొద్దని.. ఎవరైనా మంత్రి ఏవైనా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే వాటికి ఆయనే వ్యక్తిగతంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి జస్టిస్ బి.వి.నాగరత్న ప్రత్యేకమైన తీర్పు కాపీని రాశారు. 'ఎవరైనా ప్రజాప్రతినిధి ప్రభుత్వ వ్యవహారాల గురించి మాట్లాడితే.. అది ప్రభుత్వపరమైన అంశంగానే పరిగణించ బడుతుంది. ఒకవేళ ఆయన ప్రభుత్వ వ్యవహారాలతో సంబంధం లేని టాపిక్ పై వ్యాఖ్యలు చేస్తే.. దాన్ని ఆయన వ్యక్తిగత అంశంగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రజా ప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపైనే ఉంది. దేశంలోని పౌరులను కించపర్చే వ్యాఖ్యలు చేయకుండా ప్రజాప్రతినిధులను నియంత్రించేందుకు పార్లమెంటు ఒక చట్టాన్ని చేస్తే బాగుంటుందని తీర్పు కాపీలో జస్టిస్ బి.వి.నాగరత్న వ్యాఖ్యానించారు. 2016 జులైలో ఉత్తరప్రదేశ్ లోని బులంద్ షెహర్ జిల్లాలో ఓ సామూహిక అత్యాచారం కేసు నమోదైంది. అయితే దీనిపై అప్పట్లో రాష్ట్ర మంత్రిగా ఉన్న సమాజ్ వాదీ పార్టీ నేత ఆజంఖాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనను రాజకీయ కుట్రగా అభివర్ణించారు. తన భార్య, కుమార్తెపై జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించిన కేసును ఢిల్లీకి బదిలీ చేయాలంటూ బాధిత కుటుంబానికి చెందిన వ్యక్తి అప్పట్లోనే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే ఈ ఘటనను ఆజంఖాన్ రాజకీయ కుట్రగా అభివర్ణించడాన్ని ఆ వ్యక్తి తన పిటిషన్ లో తప్పుపట్టాడు. దీనికిగానూ ఆజంఖాన్ పై కేసు నమోదు చేయాలని సుప్రీంకోర్టును కోరాడు. అప్పట్లో ఈ కేసును సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారించింది. 2017 అక్టోబరులో ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసింది. తాజాగా ఈ కేసుకు సంబంధించిన తీర్పును సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించింది. ప్రభుత్వ పదవులను నిర్వహించేవారు సొంతంగా తమపై ఆంక్షలు విధించుకోవాలని రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇది లిఖితపూర్వకంగా లేనటువంటి నిబంధన అని పేర్కొంది. చులకనతో కూడిన వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తవహించాలని తెలిపింది. ఇది రాజకీయ, సామాజిక జీవనంలో ఉండాలని పేర్కొంది. జస్టిస్ బీవీ నాగరత్న ఇచ్చిన తీర్పులో, భావ ప్రకటన స్వేచ్ఛ, వాక్ స్వాతంత్య్రం ప్రజలకు చాలా అవసరమని, ప్రజలకు పరిపాలన గురించి సమాచారం బాగా తెలియాలని, పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, దీని కోసం ఈ హక్కులు అవసరమని తెలిపారు. అయితే ఇది విద్వేష ప్రసంగంగా మారకూడదన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి స్వయంగా విధించుకునే ప్రవర్తనా నియమావళి ఉండాలని చెప్పారు. ఓ మంత్రి అభిప్రాయాలు ప్రభుత్వ వైఖరిని, అభిప్రాయాలను ప్రతిబింబిస్తే, ప్రభుత్వంపై సమష్టి, ప్రత్యామ్నాయ బాధ్యతను మోపవచ్చునన్నారు. వాక్ స్వాతంత్య్రం హక్కుపై అదనపు ఆంక్షలను తీసుకురావలసిన బాధ్యత పార్లమెంటుదేనని చెప్పారు. రాజకీయ పార్టీలు తమ సభ్యులు ప్రసంగించడానికి తగిన నియమావళిని రూపొందించడంపై ఆయా పార్టీలే పరిశీలించాలని అన్నారు. జస్టిస్ వీ రామసుబ్రహ్మణ్యం ఇచ్చిన తీర్పులో, వాక్ స్వాతంత్య్రం, జీవించే హక్కు, స్వేచ్ఛ హక్కులకు సంబంధించిన ప్రాథమిక హక్కుల పరిరక్షణ ప్రైవేటు వ్యక్తులకు, ప్రభుత్వేతర శక్తులకు కూడా వర్తిస్తుందని చెప్పారు. ప్రజల ప్రాథమిక హక్కులను ప్రైవేటు వ్యక్తులు ఉల్లంఘించినప్పటికీ, రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. వాక్ స్వాతంత్య్రంపై రాజ్యాంగంలో పేర్కొన్న ఆంక్షలు మినహా, అదనంగా ఇతర ఆంక్షలను విధించలేమన్నారు.

# వన్డే వరల్డ కప్‌లో ఆడాలనుకుంటున్నా

## న్యూజిలాండ్ ఫాస్ట్ బౌరల్ ట్రెంట్ బౌల్ట్



ఆక్లాండ్,జనవరి3(ఆర్ఎన్ఎ): న్యూజిలాండ్ ఫాస్ట్ బౌరల్ ట్రెంట్ బౌల్ట్ పోయిన ఏడాది జాతీయ కాంట్రాక్టు వదులుకుని అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసిన విషయం తెలిసిందే. ఆగష్టు 10వ తేదీన అతడి కాంట్రాక్టు రద్దుకు న్యూజిలాండ్ క్రికెట ఆమోదం తెలిపింది. సెంట్రల్ కాంట్రాక్టు వదులుకోవడానికి కుటుంబంతో గడపాలని అనుకోవడమే కారణం అని తెలిపాడు. టెస్టుల్లో తన ప్రదర్శన పట్ల గర్వపడు తున్నానని, వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలని అనుకుంటున్నట్టు బౌల్ట్ తాజాగా వెల్లడించాడు. 'టెస్టు క్రికెట్‌లో నేను సాధించిన ఘనతల పట్ల చాలా గర్వ పడుతున్నా. అయితే.. నాకు ముగ్గురు చిన్నపిల్లలు. విదేశీ పర్యటనల్లో ఆడి అలసిపోవడం కంటే వాళ్లతో సమయం గడపాలి అనుకున్నా. అందుకనే కాంట్రాక్టు రద్దు చేసుకున్నా. నేను కాంట్రాక్టు వదులుకోవడం వల్ల మరొక ఆటగాడికి అవకాశం లభిస్తుంది' అని అని బౌల్ట్ వెల్లడించాడు. ఈ ఎడమ చేతివాటం ఫాస్ట్ బౌలర్ టెస్టుల్లో 317 వికెట్లు తీశాడు. వన్డేల్లో 169, టీ20ల్లో 62 వికెట్లు పడగొట్టాడు. పేసర్ ఈ ఏడాది వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలని అనుకుంటున్నాడు. వన్డే వరల్డ్ కప్‌లో మరిన్ని వికెట్లు తీయాలనుకుంటున్నా అని బౌల్ట్ తెలిపాడు. 2023 వరల్డ్ కప్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే.. అతని మాదిరిగానే మిగతా క్రికెటర్లు దేశం కంటే లీగ్స్‌కే ప్రాధాన్యం ఇవ్వడం పట్ల న్యూజిలాండ్ క్రికెట్ బోర్డ్ ఆందోళన చెందుతోంది. యువ క్రికెటర్లు కూడా బౌల్ట్ దారిలో వెళ్తే పరిస్థితి ఏంటి? అనేది ఆ దేశ క్రికెట్‌ను కలవర పెడుతోంది.

# టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న శ్రీలంక

## టపటపా వికెట్లు రాల్చుకున్న టీమిండియా




ముంబై,జనవరి3(ఆర్ఎన్ఎ): వాంఖడే స్టేడియం వేదికగా టీమిండియా జరుగుతోన్న తొలి టీ20 మ్యాచ్ లో శ్రీలంక టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా టపటపా వికెట్లను రాల్చుకుంది. వరుసగా నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ మ్యాచ్ తో టీమిండియా తరుపున గిల్, శివమ్ మావీ టీ20 ల్లోకి ఎంట్రీ ఇచ్చారు. కెప్టెన్‌గా హార్దిక్‌కు ఇదే తొలి సిరీస్ కావడం విశేషం. శుభ్‌మాన్ భారత్ తరుపున టెస్టులు, వన్డేలు ఆడాడు. కానీ మావికి ఇది భారత జెర్సీని ధరించడం ఇదే మొదటిసారి. ఈ ఇద్దరు ఆటగాళ్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరుపున ఆడారు. అయితే ఆదిలోనే భారత్‌కు ఎదురుదెబ్బలుతగిలాయి. కేవలం 30 పరుగలకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. శ్రీలంక : పాతుమ్ నిస్సాంక, కుశాల్ మెండిస్, ధనంజయ డిసిల్వా, చరిత్ అసలంక, భానుక రాజపక్స, డాసున్ శనక (కెప్టెన్), వనిందు హసరంగ, చమిక కరుణరత్నె, మహీశ్ తీక్షణ, కసున్ రజిత, దిల్షాన్ మదుషంక భారత్ : ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, సంజూ శాంసన్, హార్దిక్ పాండ్య (కెప్టెన్), దీపక్ హుడా, అక్షర్ పటేల్, హర్షల్ పటేల్, శివమ్ మావి, ఉమ్రాన్ మాలిక్, యుజ్వేంద్ర చాహల్

# ఇండియన్ జెర్సీలపై కొత్త లోగో

## కిట్ స్థానంలో వచ్చి చేరిన కేకేసీఎల్



ముంబై,జనవరి3(ఆర్ఎన్ఎ): ఇండియా– శ్రీలంక మధ్య మూడు టీ 20లు, 3 వన్డేల సిరీస్ జరగనున్న నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు 'కిట్'లో స్వల్ప మార్పు చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఇంతకు ముందున్న ఎంపీఎల్ స్పోర్ట్స్ 'కిట్' స్పాన్సర్ స్థానంలో కేవల్ కిరణ్ క్లాతింగ్ లిమిటెడ్ (కేకేసీఎల్) వచ్చింది. ఎంపీఎల్‌తో ఈ ఏడాది మార్చి వరకు బీసీసీఐకి ఒప్పందం ఉంది. అయితే తమ హక్కులను మరో సంస్థకు బదలాయిం చుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ఎంపీఎల్ బోర్డును ఇటీవలే కోరింది. ఈ క్రమంలో మూడు నెలల స్వల్ప కాలానికి కేకేసీఎల్ తెరపైకి వచ్చింది. సందర్భంగా ముంబైలో జరగనున్న ఆ మ్యాచ్ కన్నా ముందే.. టీమిండియా ప్లేయర్లు తమ జెర్సీ ఫోటోలను రిలీజ్ చేశారు. ప్లేయర్లు ధరించిన ఈ బ్లూ జెర్సీలపై కొత్త లోగో ఉండడాన్ని ఈ ఫొటోల్లో గమనించవచ్చు. చాహల్ తన ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఫొటోలో ఆ కొత్త లోగోను గుర్తుపట్టవచ్చు. అయితే ఈ కొత్త లోగోపై బీసీసీఐ ఇప్పటివరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా విడుదల చేయలేదు. కానీ కిల్లర్ లోగో ఉన్న జెర్సీలు ధరించిన ప్లేయర్ల వీడియోను మాత్రం బీసీసీఐ పోస్ట్ చేసింది. దీంతో ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ఢిల్లీ క్యాపిటల్స క్రికెట్ డైరెక్టర్‌గా గంగూలీ?



ముంబై,జనవరి3(ఆర్ఎన్ఎ): బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ మళ్లీ ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెట్ డైరెక్టర్‌గా చేరేందుకు సిద్ధమయ్యారని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి చర్చలు అన్ని ముగిశాయని సమాచారం. 2023లో జరగనున్న ఐపీఎల్ నుండి గంగూలీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో బీసీసీఐ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగిన గంగూలీ .. 2019లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెంటర్‌గా ఉన్నారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన కోచ్ కోచ్ రికీ పాంటింగ్ తో పాటుగా గంగూలీ హస్తం ఉందని తెలుస్తోంది. దాదాగా పేరొందిన గంగూలీ 16 ఏళ్ల క్రికెట్ కెరీర్ లో భారత్ తరపున 311 వన్డేలు, 113 టెస్టులు ఆడాడు. వన్డేల్లో 22 సెంచరీలతో 11363 పరుగులు చేశాడు. గంగూలీ 16 సెంచరీలతో 7212 టెస్టు పరుగులు చేశాడు. ఇక ఐపీఎల్ లో కోల్‌కతా నైట్ రైడర్స్, పూణెళి వారియర్స్ ఇండియా తరపున ఆడాడు. ఆటగాడిగా కెరీర్ నుంచి ముగించాక సీఏబీ ప్రెసిడెంట్, బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశారు.

# పంత్‌ను కలిసిన ప్రమాదం నుంచి కాపాడిని యువకులు



డెహ్రాడూన్,జనవరి3(ఆర్ఎన్ఎ): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి త్రుటిలో ప్రాణాలతో బయటపడిన టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ తనను కాపాడిన వారిని కలిశాడు. ఢిల్లీ నుంచి కారులో డెహ్రాడూన్ వెళ్తున్న పంత్ పాత్‌హోల్‌ను తప్పించే క్రమంలో డివైడర్‌కు ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు అయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానిక యువకులు రజత్, నిషు వెంటనే కారు వద్దకు పరిగెత్తుకెళ్లి పంత్‌ను కారు నుంచి బయటకు లాగారు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే కారు కాలిబూడిద అయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న డ్రైవర్ సుశీల్ కుమార్ బస్సు ఆపి అంబులెన్స్‌కు, పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పంత్‌ను రజత్, నిషులు వెళ్లి కలిసి పరామర్శించారు. ప్రమాదం తర్వాత పంత్ వీరిద్దరిని కలుసుకోవడం ఇదే తొలిసారి. నిజానికి ఆ సమయంలో పంత్ ఎవరో తమకు తెలియదని, ఆ తర్వాత అతడు క్రికెటర్ అని తెలిసిందని ఓ ఇంటర్వ్యూలో యువకులు చెప్పుకొచ్చారు.

## చలన చిత్రం

# ధనుష్‌తో సినిమాకు దిల్‌రాజు ప్లాన్



టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో దిల్‌రాజు ఒకడు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు నిర్మిస్తూ.. స్టార్ ప్రొడ్యూసర్‌గా చెలామణి అవుతున్నాడు. ప్రస్తుతం ఆయన కన్ను తమిళ ఇండస్ట్రీపై పడింది. తెలుగుతో పాటు తమిళంలోనూ తన ప్రొడక్షన్ మార్కెట్‌ను విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో వరుసగా తమిళ హీరోలు, దర్శకులతో సినిమాలు చేస్తున్నాడు. ప్రస్తుతం విజయ్‌తో చేసిన వారసుడు రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. సంక్రాంతి కానుకగా పెద్ద ఎత్తున ఈ మూవీ రిలీజ్ కాబోతుంది. దీనితో పాటు తమిళ డైరెక్టర్ శంకర్‌తో ఆర్‌సీ15 చేస్తున్నాడు. ఈ సినిమాను ఏకంగా పాన్ ఇండియా స్థాయిలో దిల్‌రాజు రూపొందిస్తున్నాడు. తాజాగా ఈ స్టార్ ప్రొడ్యూసర్ మరో తమిళ హీరోను లైన్‌లో పెట్టినట్లు తెలుస్తుంది. తమిళ హీరో ధనుష్‌తో ఓ సినిమాను ప్లాన్ చేశాడట. శ్రీకారం ఫేం కిషోర్ రెడ్డి ఇటీవలే ధనుష్‌కు సరిపడ కథను సిద్ధం చేసి, ఆయనకు నెరేట్ చేశాడట. ధనుష్‌కు కూడా కథ బాగా నచ్చిందట. అన్నీ కుదిరితే 'వారిసు' తర్వాత దిల్‌రాజు చేస్తున్న తమిళ సినిమా ఇదే. ఇక ధనుష్ కూడా ఇప్పటికే వెంకీ అట్లూరితో 'సార్', శేఖర్ కమ్ములాతో ఓ యాక్షన్ సినిమాలను చేస్తున్నాడు. కాగా తమిళ హీరోలు కూడా తెలుగులో మార్కెట్ పెంచుకునే పనిలో ఉన్నారు. అందులో మంచి పేరున్న బ్యానర్‌లో సినిమా చేస్తే టాలీవుడ్‌లో మంచి మార్కెట్ పెంచుకోవచ్చు అని ఆలోచిస్తున్నారు.

# పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో కళ్యాణ్ అమిగోస్




నందమూరి లెగసీని కంటిన్యూ చేస్తున్న వారిలో కళ్యాణ్‌రామ్ ఒకడు. బాలయ్య, తారక్‌ల రేంజ్ కాకపోయినా.. ఫర్వాలేదనిపించే నటుడిగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాడు. ఎన్నో ఏళ్ళ తర్వాత ఇటీవలే బింబిసారతో మంచి కంబ్యాక్ ఇచ్చాడు. ప్రస్తుతం కళ్యాణ్ రామ్ చేతిలో మూడు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో అమిగోస్ ఒకటి. రాజేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. మైత్రీ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 10న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస అప్‌డేట్‌లు ప్రకటిస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తున్నారు. ఈ మూవీలో కళ్యాణ్‌రామ్ త్రిపాత్రాభినయం చేస్తున్నాడు. కాగా అందులో మొదటి రోల్‌కు సంబంధించిన పోస్టర్‌ను న్యూఇయర్ సందర్భంగా రిలీజ్ చేయగా.. తాజాగా రెండో రోల్‌కు సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం రిలీజ్ చేసింది. ఫస్ట్ పోస్టర్‌లో వ్యాపర వేత్తగా సిద్దార్థ్ పాత్రలో స్టైలిష్ లుక్‌లో కనిపించిన కళ్యాణ్‌రామ్.. సెకండ్ పోస్టర్‌లో సాఫ్ట్‌వేర్‌గా మంజునాథ్ పాత్రలో ఇన్నోసెంట్ లుక్‌తో కనిపిస్తున్నాడు. ఈ రెండు లుక్స్ సినిమాపై మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేశాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కళ్యాణ్‌రామ్‌కు జోడీగా అశికా రంగనాథ్ హీరోయిన్‌గా నటిస్తుంది. జిబ్రాన్ సంగీత అందిస్తున్నాడు. సంక్రాంతి తర్వాత ఈ సినిమా ప్రమోషన్‌లు జోరుగా జరుపాలని మైత్రీ సంస్థ ప్లాన్ చేస్తుంది.



# అజయ్ లీడ్ రోల్‌లో చక్రవ్యూహం

విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా టాలీవుడ్‌లో తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నాడు అజయ్. అడపాదడపా హీరోగానూ కనిపించిన అజయ్.. మరోసారి లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'చక్రవ్యూహం'. ఇదొక మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్. చెట్కూరి మధుసూదన్ దర్శకుడు. సహస్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సావిత్రి నిర్మిస్తున్నారు. భరత్ మంచిరాజు సంగీతం అందిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేశారు మేకర్స్. పోలీస్ పాత్రలో కనిపిస్తున్న అజయ్ ఇంటెన్స్ లుక్‌తో ఉన్నాడు. మర్డర్ కేసును సాల్వ్ చేసే ప్రయత్నంలో సీరియస్‌గా వర్క్ మూడ్‌లో కనిపిస్తున్నాడు అజయ్. త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ప్రకటిస్తామన్నారు నిర్మాత.




# భాగ్‌సాలే చిత్రంతో వస్తున్న శ్రీసింహా

మత్తు వదలరా, దొంగలున్నారు జాగ్రత్త చిత్రాలతో హీరోగా ఇంప్రెస్ చేసిన కీరవాణి కొడుకు శ్రీసింహా.. త్వరలో 'భాగ్ సాలే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. ప్రణీత్ సాయి డైరెక్ట్ చేస్తున్న ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌ను అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మిస్తున్నారు. నేహా సొలంకి హీరోయిన్. కాల భైరవ సంగీతం అందిస్తున్నాడు. 'ప్రేమ కోసం' అనే మాస్ సాంగ్‌ను సోమవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ రాసిన ఈ పాటను మంగ్లీ ఎనర్జిటిక్‌గా పాడింది. 'సన్ లైటు, మూన్ లైటు.. మించిందేరా లవ్ లైటూ.. వద్దు చాటు, వద్దు లేటు.. ఉంటే చాలు కొంత చోటు' అంటూ సాగిన ఈ పాటకు నందినీ రాయ్ తన డ్యాన్స్ మూమెంట్స్‌తో జోష్ తీసుకొచ్చింది. జాన్ విజయ్, నందినీ రాయ్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, వైవాహర్ష, సత్య, సుదర్శన్, వర్షిణి ఇతర పాత్రల్లో కనిపించ నున్నారు. షూటింగ్ పూర్తయిన ఈ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in